'సురక్ష'తో అందరికీ సంపూర్ణ ఆరోగ్యం


లబ్ధిదారుకు కేస్ షీట్, మందులు అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


పోషకాహార ప్రదర్శనను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వైద్యులు, సిబ్బంది

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస: రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. వీటిని ఏడాదికి రెండు సార్లు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు చినబజారు వార్డు సచివాలయం పరిధిలో డెక్కతిపాలెం కమ్యూనిటీ హాలు వద్ద బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రుల్లో వేలాది రూపాయల ఖర్చయ్యే వైద్య సేవలు పేదల ముంగిట్లో ఉచితంగా ప్రభుత్వం అందిస్తుందన్నారు. విద్య, వైద్యం, రైతన్నకు సంక్షేమం ప్రభుత్వం తక్షణ కర్తవ్యంగా ఈ అయిదేళ్లు పనిచేసిందన్నారు. నాడు – నేడు ద్వారా ఆస్పత్రులను ఆధునికీకరించి, ఆరోగ్యశ్రీ ద్వారా ఖరీదైన వైద్యంపై పేదలకు భరోసా కల్పిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజలంతా మరోసారి పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను ప్రారంభించి ఆరోగ్య సిబ్బందిని సత్కరించారు. లబ్ధిదారులకు కేస్ షీట్లు, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్సీ బి.రాము, వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి శిల్లా సరళారాణి, కరుణాకరరెడ్డి, జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, జగన్నాథ ఎల్లాజీ, కొండపు సూరిబాబు, చిల్ల ప్రమీల, వంశీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న 'సురక్ష' నేడు

తగరపువలస: భీమిలి జోన్ బొగ్గురోడ్డు – 1 వార్డు సచివాలయం పరిధిలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరుగుతుందని జెడ్సీ బి.రాము తెలిపారు. ఈ శిబిరం ఉదయం 9 గంటల నుంచి 5 వరకు చిట్టివలస బంతాట మైదానంలో జరుగుతుందని, ఈ అవకాశాన్ని సచివాలయ పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి


యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ ఏసీపీ జాన్ మనోహర్

పీఎం పాలెం : ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారంతా తప్పకుండా హెల్మెట్ ధరించాలని ట్రాఫిక్ ఏసీపీ జాన్ మనోహర్ సూచించారు. హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలు, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రమాదాలకు గురైనప్పుడు కలిగే అనర్థాలపై యువతకు కారుషెడ్ కూడలిలో బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు తలకు దెబ్బ తగలడం వల్లే ఎక్కువ మంది చనిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. హెల్మెట్ ధరించిన వ్యక్తి ప్రమాదానికి గురైనప్పటికీ ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం చేయకుండా రోడ్డుపై ప్రయాణించే ద్విచక్ర వాహనదారులంతా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లేకుంటే కేసులు నమోదు చేయడంతోపాటు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని సూచించారు. చలానా బకాయిలున్న వాహనదారులపై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సీఐ వెంకటరావు, ఎస్ఐ మురళీ కృష్ణ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ రామారావు

ఆనందపురం : అర్హత గల ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందేవిధంగా బూత్ లెవెల్ అధికారులు (బీఎల్‌వో) చర్యలు తీసుకోవాలని ఆనందపురం తహసీల్దార్ లోకవరపు రామారావు సూచించారు. ఓటర్ల జాబితా సవరణపై భీమిలి నియోజకవర్గంలోని బీఎల్‌వోలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రామారావు మాట్లాడుతూ నియోజకవర్గంలో మొత్తం 348 పోలింగ్ బూత్‌లు ఉన్నాయన్నారు. ఓటర్ల జాబితాకు సంబంధించి చేర్పులు – మార్పుల కార్యక్రమం విజయవంతంగా పూర్తయిందన్నారు. సవరించిన ఓటర్ల జాబితాను ఈ నెల 27న అన్ని సచివాలయాల్లో, పోలింగ్ కేంద్రాల్లో ప్రజల పరిశీలన నిమిత్తం అందుబాటులో ఉంచుతామన్నారు. వాటిని పరిశీలించుకుని ఏమైనా పొరపాట్లు ఉంటే డిసెంబర్ 9 వరకు అభ్యంతరాలు స్వీకరించడంతోపాటు కొత్త ఓటర్ల నమోదుకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. వాటినన్నింటినీ పరిశీలించి జనవరి 5న తుది ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం విడుదల చేస్తుందని చెప్పారు. ఈ విషయాలను బీఎల్‌వోలు ప్రజలకు క్షుణ్ణంగా వివరించి అర్హత గల ప్రతి ఒక్కరికీ ఓటు కల్పించడంతోపాటు అనర్హులను తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో భీమిలి తహసీల్దార్ సీహెచ్‌వీ రమేష్, ఆనందపురం, భీమిలి, పద్మనాభం మండలాల బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దుర్గాలమ్మకు క్రికెటర్ వేణు పూజలు


ఆలయంలో వేణు దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న నిర్వాహకులు

మధురవాడ: నగరంలోని మధురవాడ చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మను ప్రముఖ క్రికెటర్ వేణుగోపాల్, హేమలత దంపతులు బుధవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు పట్నాల సుబ్బారావు శర్మ, మూర్తి శర్మ స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారికి ఆలయ ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, నాగోతి తాతారావు, యస్.యస్.ఎస్.మూర్తి, పిళ్లా వెంకటరమణ తదితరులు అమ్మవారి శేష వస్త్రాలు, ప్రసాదం, చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో పోతిన పైడిరాజు, పొట్నూరు హరికృష్ణ, పిళ్లా శ్రీనివాసరావు, పీస రామారావు, జగ్గుపిల్లి నాని తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన


ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ప్రతినిధులు

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురంలో గోవిందమాంబ సమేత మద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణానికి లక్కోజు ఓంకార ఆచార్యులు సిద్ధాంతి బుధవారం శంకుస్థాపన చేశారు. పద్మనాభ విరాట్ విశ్వకర్మ విశ్వబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మొదిన త్రినాథరావు, పద్మనాభం ఎంపీటీసీ సభ్యురాలు కంటుబోతు లక్ష్మి, బుడ్డివలస – అగ్రహారం సర్పంచ్ పిన్నింటి సూర్యనారాయణ, రామసింగు సన్యాసిరావు, ఎం.వి.రమణ, చెల్లూరి శ్రీనివాసరావు, వివిధ గ్రామాల నుంచి తరలి వచ్చిన విశ్వబ్రాహ్మణులు పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్ కింద బస్టాప్ ఏర్పాటు


ఫ్లై ఓవర్ కింద ఏర్పాటు చేసిన బస్టాప్

ఆనందపురం : ఆనందపురం కూడలిలో ట్రాఫిక్ నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టారు. ముఖ్యంగా బస్సులను నిలుపుదల చేయడానికి నిర్దేశిత ప్రదేశం లేకపోవడంతో ఎక్కడబడితే అక్కడ నిలిపి వేయడంతో తీవ్ర ట్రాఫిక్ సమస్య ఏర్పడేది. పెందుర్తి, విశాఖ నుంచి వచ్చే బస్సులను బంటుపల్లి వారి కళ్లాలకు వెళ్లే మార్గం పక్కన ఆపేవారు. దీని వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడేది. దీంతో ఫ్లై ఓవర్ కింద రోడ్డు పక్కన గల ఖాళీ ప్రాంతంలో బస్టాప్ ఏర్పాటు చేశారు. దీంతో ప్రయాణికులకు ఎంతో వెసులుబాటుగా మారింది. అలాగే ట్రాఫిక్ అంతరాయం కూడా చాలా వరకు తగ్గింది. అయితే ఇక్కడ పూర్తి స్థాయిలో బస్టాప్ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

అనుమానితుల సమాచారమివ్వాలి

భీమునిపట్నం: భీమిలి పరిసర ప్రాంతాల్లో నేరాలకు పాల్పడే వారిని గుర్తించి సమాచారమివ్వాలని క్రైం ఎస్ఐ సూర్యప్రకాశ్ కోరారు. సచివాలయాల్లోని మహిళ పోలీసులు, వలంటీర్లకు దీనిపై బుధవారం అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తమ పరిధిలో అనుమానంగా తిరిగేవారిని పరిశీలించాలని, వారి వివరాలను పోలీసులకు అందచేయాలని కోరారు. అటువంటి వారిని ముందుగానే గుర్తిస్తే చోరీలు, దొంగతనాలు ఆపడానికి వీలుంటుందని, అప్రమత్తంగా ఉండాలని కోరారు.

ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం


మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

కొమ్మాది: ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, ఇందులో భాగంగా గడప గడపకు వచ్చి సమస్యలు తెలుసుకుంటున్నామని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ దరి సిరిగిడినగర్‌లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఏదో ఒక సంక్షేమ పథకం ద్వారా లబ్ధి పొందారని, అందుకే ఎక్కడకు వెళ్లినా ప్రజలు నీరాజనం పడుతున్నట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలోనే చదువుకు, వైద్యానికి పెద్ద పీట వేస్తున్నామని, అదేవిధంగా సంక్షేమంతోపాటు అభివృద్ధి కూడా సమానంగా సాగుతోందన్నారు. ఇప్పుడు ఎన్నికలు లేకపోయినా ప్రజా సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారం కోసమే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్థానికులు ఎమ్మెల్యేకు పలు సమస్యలు విన్నవించుకున్నారు. వీధిలైట్లు వెలిగించాలని, డ్రైనేజీలకు మరమ్మతులు చేయించాలని, తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు. అనంతరం రుషికొండ దరి ఒమ్మివానిపాలెంలో జీవీఎంసీ నిధులతో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, నాయకులు ఉప్పులూరి గోపి, లొడగల రామ్మోహన్, అల్లాడ ఉమామహేశ్వరరావు, మాదు చంటి, బుజ్జి, రమణమూర్తి, దువ్వి వాసు, చెన్నాదాసు, జ్యోతిర్మయి, తదితరులు పాల్గొన్నారు.

పాట్నూరులో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

పద్మనాభం: మండలంలోని పాట్నూరు గ్రామంలో పని చేయని రెండు ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేశారు. 'ట్రాన్స్‌ఫార్మర్లు పనిచేయక అన్నదాతల ఆందోళన' శీర్షికతో సాక్షిలో ఈ నెల 23న ప్రచురించిన వార్తకు విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించారు. విద్యుత్ సరఫరా లేక వ్యవసాయ పంపుసెట్లు పనిచేయకపోవడంతో వరి పంటకు నష్టం జరుగుతుండడంతో మధురవాడ డీఈ పోలాకి శ్రీనివాసరావు, ఏడీ కిరణ్‌కుమార్ స్పందించారు. గులమజ్జి వారి కళ్లాలు, విశ్వరాజు చెరువు కింద పనిచేయని ట్రాన్సుఫార్మర్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేశారు. దీంతో వీటి కింద వ్యవసాయ పంపుసెట్లు బుధవారం నుంచి వినియోగంలోకి వచ్చి వరి పంటకు సాగు నీరు అందుతుండడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ పనితీరు వివరించేందుకే బస్సుయాత్ర


బస్సు యాత్ర పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు

- పోస్టర్లు ఆవిష్కరించిన ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం: ఇప్పటి వరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని ప్రభుత్వం ప్రజలకు అందించిన సంక్షేమం, చేసిన అభివృద్ధిని వివరించడానికి సామాజిక సాధికార బస్సు యాత్రను నిర్వహిస్తున్నామని, దీన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బస్సు యాత్రకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 28న ఉత్తరాంధ్ర నుంచి తగరపువలసకు యాత్ర వస్తుందని, ఆ సమయంలో నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరై ఘనంగా స్వాగతం పలకాలని కోరారు. గతంలో దేశంలోనే ఎన్నడూ, ఎక్కడా జరగని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేసి, అభివృద్ధి చేశామన్నారు. ఈ విషయంలో ప్రజలంతా ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. ప్రభుత్వంలో జరిగిన మంచిని అందరికీ పూర్తిగా వివరించడానికే బస్సు యాత్ర నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగా తగరపువలసలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. మంత్రులు బొత్స సత్యనారాయణ, సీదిరి అప్పలరాజు, ధర్మాన ప్రసాదరావు, ముఖ్య నాయకులు పాల్గొంటారని, విజయవంతం చేయడానికి అందరూ సహకరించాలని కోరారు. అలాగే నవంబర్ 1 నుంచి 'ఏపీకి జగనన్న ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని సచివాలయాల్లో నిర్వహిస్తామని తెలిపారు. సచివాలయాల వద్ద జెండాలు ఎగురవేసి, ఆ ప్రాంతంలో జరిగిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ దంతులూరి వాసురాజు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు దాట్ల పెదబాబు, భీమిలి జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, ఆనందపురం జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

వేడుకగా అమ్మవారి ప్రతిమల నిమజ్జనం


టి.నగరపాలెం వద్ద గోస్తనీనదిలో అమ్మవారి ప్రతిమ నిమజ్జనం చేస్తున్న భక్తులు


అమ్మవార్ల ప్రతిమలను నిమజ్జనానికి ట్రాక్టర్లపై తరలిస్తున్న దృశ్యం

తగరపువలస: శరన్నవరాత్రుల సందర్భంగా వివిధ మండపాల్లో ప్రతిష్ఠించిన అమ్మవార్ల ప్రతిమలను ఉత్సవ కమిటీల ప్రతినిధులు బుధవారం సాయంత్రం ఊరేగింపుగా తీసుకెళ్లి స్థానిక గోస్తనీనది, భీమిలి సముద్ర తీరంలో నిమజ్జనం చేశారు. బాణసంచా, నేలవేషాలు, కోలాటం, తీన్‌మార్, డీజే తదితర హంగామాతో ఊరేగింపు యాత్ర సాగింది. టి.నగరపాలెం, చిట్టివలస, సంతపేట గొల్లవీధి తదితర ప్రాంతాల్లో నిమజ్జన యాత్రలు కన్నులపండువగా సాగాయి. భీమిలి రోడ్డులోని మండపంలో ఏర్పాటు చేసిన కాళీమాత, రాజరాజేశ్వరి, వినాయకుడు, లక్ష్మి, సరస్వతీదేవి, సుబ్రహ్మణ్యస్వామి తదితర 15 మంది దేవతాపరిగణాన్ని అర్చకుడు సోమయాజుల కల్యాణ చక్రవర్తి ఆధ్వర్యంలో భవానీలు టి.నగరపాలెం గోస్తనీనదిలో నిమజ్జనం చేశారు.

ఘనంగా దేవి నిమజ్జనం

పద్మనాభం: మండలంలోని మద్ది గ్రామంలో దేవి ప్రతిమ నిమజ్జనం బుధవారం రాత్రి ఘనంగా జరిగింది. నిమజ్జనానికి ఊరేగింపుగా దేవి విగ్రహాన్ని తీసుకెళ్లే రోడ్లను పసుపు నీళ్లతో శుద్ధి చేశారు. కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాల నడుమ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించి వెంకపతి రాజు చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు బుగత సత్యనారాయణ పాల్గొన్నారు.


నిమజ్జనానికి తరలిస్తున్న దుర్గమ్మ విగ్రహం

సంతబయలులో వెలుగులు


సంతబయలులో వెలుగుతున్న వీధిదీపాలు

సాక్షి ఎఫెక్ట్..

తగరపువలస: స్థానిక సంతబయలులో చీకట్లను పారద్రోలి వెలుగులు విరజిమ్ముతున్నాయి. ఇక్కడి రహదారిలో వీధిదీపాలు వెలగకపోవడంతో 'సంతబయలులో అంధకారం' శీర్షికతో ఈ నెల 22న సాక్షిలో వార్తను ప్రచురించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు భీమిలి జోన్ ఏఈ సుమన్ స్పందించి బుధవారం కొత్త వీధి దీపాలు సిబ్బందితో పునరుద్ధరింపజేశారు.

భగవద్గీత సారంపై ప్రవచనం

సీతంపేట: కంచికామకోటి శంకరమఠం, గీతా ప్రచార సమితి సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం శ్రీమద్ భగవద్గీత సారంపై శంకరమఠం ప్రాంగణంలో ప్రవచనం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి, ఆచార్య మద్దులపల్లి దత్తాత్రేయ శాస్త్రి భగవద్గీత సారంపై ప్రవచనం చేసి దాని విశిష్టతను తెలియజేశారు. ప్రతి ఒక్కరూ గీతా సారాంశాన్ని తెలుసుకోవాలన్నారు. చావలి విశ్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

380 మంది అయ్యప్పస్వామి దీక్ష స్వీకరణ


చిట్టివలస జ్యూట్‌మిల్లు రామాలయంలో మాలలు వేస్తున్న అర్చకుడు గణేష్

తగరపువలస: భీమిలి ప్రాంతంలో అయ్యప్ప స్వామి దీక్ష స్వీకరించే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. నవంబరు 16 నుంచి డిసెంబరు 27 వరకు శబరిమలైలో మండలదీక్షకు సంబంధించి ఆలయం తెరచి ఉంచుతారు. ఇప్పటికే చాలా మంది దీక్ష స్వీకరించగా విజయదశమి తర్వాత వీరి సంఖ్య వేలల్లో చేరింది. బుధవారం ఏకాదశి కలిసి రావడంతో ఒక్కరోజే చిట్టివలస జ్యూట్‌మిల్లు రామాలయంలో 380 మంది భక్తులకు అయ్యప్ప మాలలు వేసినట్టు అర్చకులు ఆకెళ్ల భాగ్యరాజా, రవిగణేష్ తెలిపారు. కార్తీకమాసం ప్రారంభమైన తర్వాత అయ్యప్ప స్వాములతోపాటు భవానీ దీక్షలు చేపట్టే వారి సంఖ్య వేలల్లోకి చేరుతుంది. మరొక వైపు దీక్ష చేసే స్వాములు, భవానీలకు నవంబరు నుంచి ఉచితంగా భిక్ష అందించేందుకు తగరపువలస, భీమిలి, లక్ష్మీపురం, కృష్ణంరాజుపేటకు చెందిన ఆధ్యాత్మిక సంస్థలు సన్నాహాలు చేసుకుంటున్నాయి.

పరిసరాల పరిశుభ్రతతో దోమల నియంత్రణ


ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

భీమునిపట్నం: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అప్పుడే దోమల వ్యాప్తిని నియంత్రించవచ్చని మలేరియా నివారణ విభాగం అధికారి సూరిబాబు సూచించారు. బుధవారం సాయంత్రం ఇక్కడ పలు ప్రాంతాల్లో సిబ్బంది దోమల మందుతో ఫాగింగ్ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఇళ్ల వద్ద చాలా మంది నీటిని నిల్వ వుంచుతున్నారని, కాలువల్లో నీరు నిలిచిపోవడంతో దోమలు పెరిగిపోతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలని కోరారు.

పబ్లిక్ డిమాండ్

టీచర్స్ లే అవుట్‌లో అంధకారం

మధురవాడ: జీవీఎంసీ 6వ వార్డు కొమ్మాది టీచర్స్ లే అవుట్ మాస్టర్ ప్లాన్ రోడ్డులో కొన్ని ప్రాంతాల్లోని విద్యుత్ స్తంభాలకు వీధిలైట్లు లేవు. దీంతో ఈ పరిసర ప్రాంతాల్లో అంధకారం అలముకుంది. అసలే నిర్మానుష్య, శివారు ప్రాంతాల్లో వీధిలైట్లు లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఇక్కడ 4 అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. 200 వరకు నివాసాలున్నాయి.


వీధిలైట్లు లేక అంధకారమయమైన టీచర్స్ లే అవుట్

పదుల సంఖ్యలో విద్యుత్ స్తంభాలున్నా వీధిలైట్లు లేకపోవడంతో చీకటిలో బయటకు రావడానికి చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఈ విషయంపై జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు. నెలల తరబడి ఇదే పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలి.

– ఎం.సరళ, కొమ్మాది టీచర్స్ లే అవుట్.

స్నానాల ఘాట్ వద్ద మందుబాబుల చిందులు


టి.నగరపాలెం స్నానాల ఘాట్ వద్ద మందుబాబులు పడేసిన గ్లాసులు, మద్యం సీసాలు

తగరపువలస: భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీలో గోస్తనీనది వద్ద స్నానాల ఘాట్‌ను మందుబాబులు అడ్డాగా మార్చుకున్నారు. ఈ ఘాట్‌ను ఆనుకుని జీవీఎంసీ ఊటబావులు, పంప్‌హౌస్, డీవీస్ పంప్‌హౌస్, ఆంజనేయస్వామి ఆలయాలు ఉన్నాయి. ఇదే స్నానాల ఘాట్ వద్ద నదిలో పలువురు భక్తులు పుణ్యస్నానాలు కూడా ఆచరిస్తుంటారు. అయినప్పటికీ మందుబాబులు వెనక్కు తగ్గకుండా ఈ పరిసరాలతోపాటు పవిత్ర నదిని మద్యం సీసాలు, తినుబండారాలు, డిస్పోజబుల్ గ్లాసులతో కలుషితం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా భీమిలి పోలీసులు, పంచాయతీ పాలకవర్గం, సచివాలయ సిబ్బంది నిఘా ఉంచాలని స్థానికులు కోరుతున్నారు.